ఓం నమో గణేశాయ

ఓం నమో దత్తాత్రేయాయ

ఓం నమో సాయినాథాయ

ఉపోద్ఘాతము

ఈ శ్రీ సాయినాథ స్తవన మంజరిని రచించిన దాసగణు మహరాజ్ బాబాకి అంకిత భక్తుడు. రెండు దశాబ్దాల పాటు బాబాతో ప్రత్యక్ష సంబంధం కలిగి దర్శన, స్పర్శన, సంభాషణల ద్వారా వారికి సన్నిహితుడై, ఆయన యొక్క సంపూర్ణానుగ్రహాన్ని పొందిన భక్తుడు. బాబా లీలల్ని ప్రత్యక్షంగా చవి చూచిన భక్తుడు. బాబా తన చరణాలనుండి గంగా యమునలు స్రవింపచేసి, ప్రయాగ సంగమానికి వెళ్ళకుండానే దాసగణుకు సంగమ స్నానఫలాన్ననుగ్రహించి పరమాద్భుతమైన లీలను ప్రదర్శించారు. అంతటి అసమాన లీలలకు దాసగణు సాక్షీభూతుడయ్యాడు. మహారాష్ట్ర దేశమంతటా పర్యటించి తన హరికథల ద్వారా సాయిబాబా మహత్యాన్ని, లీలల్ని విరివిగా ప్రచారం చేశాడు. చక్కని మరాఠీ కవనంతో, మధుర, మనోహర కంఠంతో, గాన నైపుణ్యంతో, భక్తిపారవశ్యంతో, సర్వత్రా సాయిని దర్శించగల మనస్తత్వంతో వేలాది భక్తులనాకర్షించి, సామాన్య ప్రజానీకం సహితం సాయి భక్తులై తరించడానికి దోహదం చేసిన సమర్థుడు, గురు సేవా పరాయణుడు దాసగణు.

ఈయన అసలు పేరు గణపతిరావు దత్తాత్రేయ సహస్రబుద్ధే. దాసగణు మహరాజ్‌గా, గణూదాస్‌గా సుప్రసిద్ధుడు. పోలీసు డిపార్టుమెంటులో కానిస్టేబుల్‌గా పని చేసేవాడు. ది. 6-1-1868 న అహమ్మద్‌నగర్ జిల్లాలోని అకోల్నేర్ గ్రామంలో బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. తన 94వ యేట శుభకృతు కార్తీక బహుళ త్రయోదశి ది. 25-11-1962 ఆదివారం ఉదయం 9 గంటలకు దాసగణు పవిత్ర పండరీ క్షేత్రంలో పాండురంగడిలో ఐక్యమయ్యాడు. అది ఆలంది జ్ఞానేశ్వర మహరాజ్ జీవ సమాధినొందిన శుభదినం కూడా.

స్వర్ణయోగి అయిన సాయిబాబా ఇనుప ముక్కలాంటి ఒక సామాన్యమైన పోలీసు కానిస్టేబుల్ను బంగారంలాంటి సాధు సత్పురుషుడిగా తీర్చి దిద్దారు. అతడి కీర్తనల ద్వారా వేలాదిమంది సాయి భక్తులుగా మారడానికి దోహదం చేశారు." అని ఆలిండియా సాయి సమాజ్, మద్రాసు వ్యవస్థాపకులు, అధ్యక్షుడు అయిన పూజ్యశ్రీ బి.వి. నరసింహ స్వామి గారు దాస్‌గణు మహరాజ్‌ని కొనియాడారు.

అట్టి భక్తి పథంలో ఎంతో ఉన్నత శిఖరాలనధిరోహించిన మహనీయుడు దాస్‌గణు, సద్భక్తితో సత్యాన్వేషణ చేసి తన్మయుడై తన భాషా నైపుణ్యం, స్వానుభవం జోడించి శ్రీ సాయినాథుని స్తుతిస్తూ, గానం చేస్తూ 'మరాఠీ' భాషలో 163 శ్లోకాలతో ఈ శ్రీ సాయినాథ స్తవన మంజరీని రచించాడు. బాబాతో ఇరవై సంవత్సరాల పాటు సన్నిహిత సంబంధాలు కలిగి సామీప్య సారూప్యముల ద్వారా వారి కరుణ, ప్రేమ, ఆదరణ పొంది వారి మహత్మ్యము నెరిగి స్తవన మంజరీ రూపంలో సాయిబాబా యొక్క నిజతత్త్వాన్ని, స్వరూపాన్ని, అవతార పరమార్థాన్ని ప్రతిబింబింపజేసిన మహాభక్తుడు, పండితుడు, కవి, గాయకుడు దాస్‌గణు.

'స్తవము' అంటే స్తుతి, పొగడ్త, భగవంతుడు స్తోత్ర ప్రియుడు. భగవంతుడి గుణాలను వర్ణించడం ఎంతో కష్టం. వేయి నాల్కలుగల ఆదిశేషుడికే అది సాధ్యంకాదు. అవి వాక్కులకు, మనసుకు అందనివి. భక్తులే పండితులైతే భగవంతుడి తత్వం, మహత్మ్యం గ్రహించి వారి అనుభవాలు, గ్రహించిన సత్యాలు, లీలలు వారి శక్త్యానుసారంగా లిఖిస్తారు. అవి వారి ఆరాధ్య దైవంయొక్క అనుగ్రహం వల్లనే సమగ్రంగా, దివ్యంగా, ప్రామాణికంగా, మనోహర శైలిలో వారి ఎఱుక లేకనే వారి కలంనుండి జాలువారి 'స్తవము'ల రూపు దాల్చుతాయి. అవి పాఠక లోకంలో ఎంతో ప్రభావాన్ని కలిగించి, వారిపై చెరగని ముద్ర వేస్తాయి. అందుకే గాబోలు దాస్‌గణు ఈ సత్యాన్ని గుర్తించి, నేను నిమిత్త మాత్రుడను. సాయి సద్గురుని ప్రేరణ వల్లనే, ఆయన కరుణతోనే నేనీ స్తవన మంజరీని రచించగలిగాను. లేనిచో పామరుడనైన నాచే ఈ స్తోత్ర రచన

సంభవమా? ' అని వినమ్రతతో ఈ రచనకు కర్తృత్వం వహించలేదు.

గమనిక

సాయిబాబా మహా సమాధి	:	**15-10-1918 మంగళవారం**
ఈ స్తవన మంజరి రచన	:	**09-09-1918**
బాబా సముఖంలో చదివి బాబాకి అంకితమిచ్చింది	:	**12-09-1918 గురువారం**

(బాబా మహాసమాధికి కేవలం 36 రోజుల ముందు మాత్రమే ఈ గ్రంథం వ్రాయబడింది)

సాయిపై అసంఖ్యాకమైన స్తోత్ర గ్రంథాలున్నాయి. కాని ఈ స్తవన మంజరి వాటిలో తలమానికం వంటిది. ఎందుకో తెలుసా? శిరిడీలో ద్వారకామాయిలో సాయి సమర్థులు ప్రశాంతంగా ఆశీనులై వున్నప్పుడు ఆయన సముఖంలో దీనిని గానం చేసి, సాయికే అంకితమిచ్చాడు దాస్‌గణు. సాయీశుడు తన్మయత్వంతో, నిమీలిత నేత్రాలతో, చిరునవ్వు చిందిస్తూ దీనిని సంపూర్ణంగా శ్రవణం చేసి, చివరిలో తన ఆమోదం తెలుపుతూ, 'దీనిని నిత్య పారాయణ చేసేవారు సర్వారిష్టాలు తొలగి సుఖ శాంతులతో, భోగ భాగ్యాలతో వర్ధిల్లెదరుగాక!' అని ఆశీర్వదించారు. (అని ఆ సమయంలో అక్కడేవున్న సాయి అంకిత భక్తుడు సగుణమేరు నాయక్ అన్నాడు). అంటే “మహామహిమాన్వితమైన ఈ స్తవన మంజరిని పఠించేవారిపై సాయి భగవానుని కృప ప్రసరిస్తుంది. సాయినాథ భగవానుడు సత్వరమే వారి ఐహిక పరమార్థిక కోరికలన్నీ నెరవేర్చి అంత్యకాలంలో ఉత్తమ గతులు ప్రసాదిస్తారు. దీని పారాయణ వలన మందబుద్ధుల బుద్ధి వికసిస్తుంది. అల్పాయుష్కులు శతాయుష్కులౌతారు. నిరుపేదలు కుబేర సములౌతారు. సంతానం లేనివారికి సంతానం కలుగుతుంది. రోగులు పూర్ణారోగ్యవంతులౌతారు. వారి సకల చింతలు, భయాలు తొలగిపోతాయి. కీర్తిమంతులై గౌరవ సత్కారాలు పొందుతారు. చివరకు

అవినాశ పరబ్రహ్మను తెలుసు కొంటారు" అన్న ఈ స్తోత్ర ఫలశృతిని సాయి ఆమోదించారు. ఐతే, "తర్క వితర్కాలకు తావివ్వకండి. ఈ మహిమాన్విత స్తోత్ర పఠనం వలన ఒనగూడే సత్ఫలితాలపై పరిపూర్ణ విశ్వాసం కలిగి వుండండి" అన్న దాస్‌గణు వచనాలు మనం హృదయంలో నిలుపుకోవాలి.

'యద్భావం తద్భవతి' – మన భావం ఎలాగో ఫలితం అలాగ. ఇన్ని మాటలెందుకు? ఈ స్తవన మంజరీ నిత్య పారాయణ వలన కుటుంబంలో సుఖ సంతోషాలు వెల్లివిరుస్తాయి.

దీనిని శిరిడీలో వారం రోజుల పాటు రోజుకు పదకొండు సార్లు పారాయణ చేస్తే సాయి సందర్శన భాగ్యం కలుగుతుందని ప్రతీతి.

సర్వే జనాః సుఖినో భవంతు! సర్వం శ్రీ సాయినాథార్పణమ్!

హైదరాబాదు

13-05-2006

సాయి సేవలో,
అనువాదకుడు,
శ్రీ యిమ్మిడిశెట్టి ప్రభాకర రావు

నిత్యపారాయణ క్రమము

ఈ శ్రీ సాయినాథ స్తవన మంజరీ నిత్య పారాయణకు ఎలాంటి కఠిన నియమ నిబంధనలు లేవు. సాయిపట్ల సంపూర్ణ విశ్వాసం, భక్తి ప్రేమలే అసలైన సిసలైన నియమాలు. ఏ సమయంలోనైనా సరే–పగలుగాని, రాత్రిగాని ప్రశాంతమైన మనస్సుతో, వీలైనంత ఏకాంత ప్రదేశంలో కూర్చొని, సాయిబాబా రూపాన్ని మనసులో ధ్యానించి పారాయణ చేయవచ్చు.

1. ఈ స్తవన మంజరీని నిత్యం పారాయణ చేసేవారి సర్వకష్టాలు ఒక సంవత్సరంలోనే తొలగిపోతాయి.

2. నిత్య పారాయణకు అవకాశం లేకపోతే ప్రతి గురువారంనాడు పఠించినప్పటికీ కోరికలు తీరి సత్ఫలితాలు కలుగుతాయి.

3. అందుకు కూడ అవకాశం లేనివారు కనీసం ప్రతి ఏకాదశినాడు పారాయణ చేసినప్పటికీ కోరికలు తీరి నిస్సందేహంగా అద్భుతమైన ఫలితాలు పొందగలరు.

అని ఫలశ్రుతిలో రచయిత వివరించారు. అది వింటూ బాబా ఆమోద సూచకంగా తల ఊపారు. అంటే దీని పారాయణ సూక్ష్మంలో మోక్షం.

ఓమ్ నమో దత్తాత్రేయాయ **ఓమ్ నమో సాయినాథాయ**

శ్రీ సాయినాథ స్తవన మంజరీ

అంజలి

॥ఓం శ్రీ గణేశాయ నమః॥

జగదాధారా! సర్వ సాక్షీ! ఓ పార్వతీనందనా! మయూరేశ్వరా! లంబోదరా! ఊహాతీతా! ఓ గణపతీ! పాహి మాం. నీవు సకల గణాధిపతివి. అందుకే గణేశుడుగా ప్రసిద్ధి చెందావు. సకల శాస్త్రాలు నిన్ను కీర్తిస్తూ వున్నాయి. ఓ మంగళ స్వరూపా! ఫాలచంద్రా! నన్ను రక్షించు.

ఓ సరస్వతీ! వాగ్విలాసినీ! నీవు శబ్ద సృష్టికి రాణివి. నీ ప్రాభవం వల్లనే పలుకులు ప్రభవమందుతాయి. నీ అస్తిత్వం వల్లనే లోక వ్యవహారాలన్నీ జరుగుతాయి. గ్రంథకర్త లందరికి నీవే ఆరాధ్య దేవతవు. నీవు ఈ జగతికే అలంకార భూషణానివి. నీవు ఊహాతీతమైన మహాశక్తివి. ఓ జగన్మాతా ! వాగ్దేవీ ! నీకు వందనం.

దేవతా స్తుతి

ఓ పండరీనాథా! పాండురంగా! పూర్ణపరబ్రహ్మా! సాధుజనప్రియా! సగుణ స్వరూపా! దయాసాగరా! నరహరీ! పరమ దయామయా! నన్ను రక్షించు. ఓ జగన్నాటక సూత్రధారీ! రుక్మిణీ వల్లభా! సర్వ జగద్వ్యాపకా! శాస్త్రాలన్నీ నీ స్వరూపాన్నే వర్ణిస్తున్నాయి. ఓ చక్రపాణీ! పుస్తక జ్ఞానులకు నీవు అంతుపట్టవు. గ్రంథాలు పఠించినంత మాత్రాన విజ్ఞులౌతారా! ఆ మూర్ఖ పండిత శిఖామణులు పాండిత్యంతో

కేవలం వాదాలకే పరిమితమై ఆ శాస్త్ర చర్చల్లోనే మునిగి తేలుతూ వుంటారు. సాధు సత్పురుషులు మాత్రమే నిన్ను తెలుసుకొన గలుగుతారు. మాయా మోహితులైన మిగిలిన జనావళికి అది అసాధ్యం. ఓ దేవా! నీకివే సాష్టాంగ దండ ప్రణామములు. సాదరంగా స్వీకరించి నన్ను రక్షించు.

ఓ పంచవదనా ! శంకరా ! కపాల మాలాభరణా ! నీలకంఠా ! దిగంబరా ! ఓ పశుపతీ ! ఓంకార స్వరూపా ! నీకు నమస్కారం. నీ నామాన్ని స్మరించినంత మాత్రాన దైన్యం నశిస్తుంది. ఓ ధూర్జటీ ! ఏమి నీ నామ మహిమ ! ఓ నీలకంఠా ! నీ చరణాంబుజాలకు నమస్కరించి నేనీ స్తోత్రాన్ని (స్తవన మంజరీని) వ్రాయబూనితిని. ఓ పరమేశ్వరా ! సదా నీ సంపూర్ణ సహాయాన్నందించి నన్ను సఫలీకృతుణ్ణి చెయ్యి.

ఓ అత్రి నందనా ! దత్తాత్రేయా ! నీకు వందనం. మా కులదేవత శ్రీ మహాలక్ష్మికి ప్రణతులు. తుకారాం మొదలైన సాధు సత్పురుషులకు, 'ఇతర భక్తవరేణ్యులకు నమస్కృతులు.

శ్రీ సాయినాథ ప్రభూ! మీకు జయము, దిగ్విజయము, పతిత పావనా! దయామయా! మీ పాద పద్మాలపై నా శిరస్సు నుంచాను. ఆశ్రిత మందారా! అభయ ప్రదాతా! నన్ను సకల భయాల నుండి రక్షించు. ఓ సాయినాథా! సౌఖ్యధామ నిలయమైన పూర్ణ పరబ్రహ్మ మీరే! పురుషోత్తముడైన శ్రీ మహావిష్ణువు, మదనాంతకుడైన ఉమాపతి శంకరుడు కూడ మీరే! నీవు నరరూపు దాల్చిన పరమేశ్వరుడవు. జ్ఞానాకాశంలో ప్రకాశించే భాస్కరుడవు. కరుణా సాగరుడవు. భవరోగాలకు ఔషధం వంటివాడవు. నీవు దీనుల హీనుల పాలిట చింతామణివి. భక్త జనులను పునీతులను గావించే పావన గంగా నదీమతల్లివి. సంసార సాగరంలో మునిగి దారి కానని వారిని దరి చేర్చే నౌకవు. ఈ జగతిలో భయార్తులకు నీవే ఆశ్రయం. నీవు ఈ జగతికే మూల కారకుడవు. శుద్ధ చైతన్య స్వరూపుడవు. ఓ కరుణా సాగరా! ఈ ప్రపంచమంతా నీ లీలా విలాసమే కదా!

ఆత్మ – జీవులు

జనన మరణాలు అజ్ఞాన భావ జనితాలు. అవి కేవలం భ్రాంతి మాత్రమే. సంపూర్ణ జ్ఞానులు ఎంతో పరిశోధించి గ్రహించిన సత్యమిది. అట్టి అజ్ఞాన తిమిరాన్ని నశింపజేసే నీకు జనన మరణాలు లేవు. సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపుడవైన నీవు వాటి కతీతుడవే కాదు, నిజానికి వాటిని శాసించే మహారాజువు కూడా!

'జల కుండము' లో కనిపించే నీరు అక్కడే పుట్టినట్లా? కాదు కదా! అది పూర్వం ఏనాటి నుండో భూగర్భంలో నున్న జల నిక్షిప్తం నుండి ఇప్పుడు పైకి ఉబికి వచ్చిన ఊటనీరు మాత్రమే! పల్లపు ప్రదేశంలో నీరు ఊరితే దానిని 'కుండము' అంటాం. ఆ నీరే లేకపోతే దానిని 'గుంట' అంటాం. నీరు నిండడం, ఇంకడం అనే స్థితులు నీటికి సంబంధించినవి కావు. అవి కేవలం 'కుండము' నకు మాత్రమే చెందినవి. 'కుండము' లో వుండే నీరు తన మహత్యాన్ని ఎన్నడూ ఆ కుండానికివ్వదు (జనన మరణాల తనువుకే గాని ఆత్మకెప్పుడూ అన్వయించవు). నీటితో నిండుగా వుండి కళ కళ లాడుతూ వున్నప్పుడు 'కుండము' గర్విస్తుంది. కాని ఆ నీరే ఇంకిపోతే దీనావస్థకు చేరుకొంటుంది. ఈ మానవ దేహమే ఒక 'కుండము'. అందులోని నిర్మలమైన నీరే శుద్ధ చైతన్యం (జీవాత్మ). కుండములు అనేకం. ఐనా 'జలం' ఒక్కటే.

ఓ సాయిదేవా! దయామయా! నీవు 'అనాది' వి. జనన మరణాల కతీతుడవు. నీవే వజ్రాయుధమై నాలోని అజ్ఞాన పర్వతాన్ని ఛేదించి సమూలముగా నాశన మొందించు (జ్ఞానోదయాన్ని కలిగించు). ఇంతవరకు ఈ భూమండలంపై ఎన్నో కుండములు (జీవులు) జనించాయి. ఇక ముందు కూడ ఉద్భవిస్తాయి. అట్టి ప్రతి ఒక్క కుండానికి (జీవికి) ప్రత్యేకమైన నామ రూపాలుంటాయి. కల్పాంతం వరకూ అవి అలా పిలువబడుతూ, గుర్తించబడుతూ వుంటాయి. నిఖిల జగతిలోని సమస్త జీవులయందు విరాజమానమై వున్నది ఒకే 'చైతన్య శక్తి'. అనగా సకల జీవులయందు వున్నది ఒకే 'ఆత్మ' అందుకే 'నీవు' 'నేను' అనే తారతమ్య భావం ఉచితం కాదు. అణువణువులోని

వ్యాపించివున్న ఒకే చైతన్య వస్తువును 'నీవు – నేను' అనే ద్వైత భావంతో చూడడం ఎంత మాత్రం సమంజసం కాదు, మేఘాలన్నిటి నుండి వర్షింపబడే నీరంతా ఒక్కటే! కాని ఆ నీరు భూమిపై పడగానే నదీ నదములు కాలువలు సరస్సులు, బావులు, ఊటబావులు మొదలైన రక రకాల రూపాలు పొందుతుంది.

గోదావరి నదీ గర్భంలో చేరిన నీరు గోదావరిగా పిలువబడుతూ, పవిత్రంగా భావింపబడి పూజలందుకొంటుంది. కాని బావుల్లో, గుంటల్లో, చేరిన నీటికి అంతటి విలువ వుండదు. ఓ సాయిపరమాత్మా! నీవు అమల గోదావరీ ప్రవాహం వంటివాడవు. మేము అల్పమైన వాపీ కూప తటాకాల్లాంటివాళ్ళం. మీకూ మాకూ మధ్య అదే తారతమ్యం. ఓ సాయిగురువరా! మా జీవితాలు సార్థకం చేసుకోవడంకోసం మీకు సర్వస్యశరణాగతులమై మీ దరి చేరాం. ఓ పవిత్ర మూర్తీ! మమ్ము సదా రక్షించు. గోదావరి నదీ జలాలకంతటి పవిత్రత ఆ 'నదీ గర్భం' వల్ల మాత్రమే! అంతేకాని జలానికి ప్రత్యేకమైన విశిష్టతంటూ ఏమీ లేదు. ఏ నీరైనా ఒక్కటే! నిజానికి గోదావరి గర్భం వల్లనే ఆ నది ప్రవహించే ప్రదేశమంతా పవిత్రత సంతరించుకొంది. పరిశీలించి చూడగా అట్టి పవిత్రతను చేకూర్చే విశిష్ట గుణం ఆ భూభాగం లోని మట్టిదే ! మేఘాలనుంచి నేలపై కురిసిన నీరు ఎక్కడ ఎట్టి మార్పు చెందకుండా (కల్మష పూరితం కాకుండా) వుంటుందో ఆ భూభాగాన్ని జ్ఞానులు 'పవిత్ర గోదావరి' అని వ్యవహరిస్తారు. మేఘాలలోని జలం మొదట మధురంగా వుంటుంది. కాని అది ఇతర ప్రదేశాలలో కురవగానే అక్కడి నేలయొక్క సహజ గుణాలవల్ల రోగకారకం, ఉప్పు, చేదు లాంటి అవగుణాలను గ్రహిస్తుంది.

ఓ సద్గురురాయా! మీలాగ కామ క్రోధ లోభాది అరిషడ్వర్గాల కల్మషాలు అంటని పవిత్ర మూర్తులకు 'సత్పురుషులు' అన్న నామం శోభిస్తుంది. కనుక సత్పురుషులందరు పవిత్ర "గోదావరినది" లాంటి వాళ్ళు. ఓ సాయిదేవా! మీరు వారందర్లో అత్యున్నత స్థానాన్ని అలంకరించారు. సృష్ట్యాదినుండి గోదావరి నది వున్నది. నాటినుండి నేటి వరకు లోటు లేకుండా నిండుగా ప్రవహిస్తూనే వుంది. (నీరు

మారుతున్ననూ, ఎప్పుడూ నిండుగావుండే గోదావరి ప్రవాహంలా జీవులను పాప పంకిలం నుంచి ఉద్ధరించే నిమిత్తం సత్పురుష పరంపర అవతరిస్తూనే వుంటుంది.)

ఎప్పుడో త్రేతాయుగంలో శ్రీరామ చంద్రుడు పవిత్ర గోదావరి తీరాన్ని దర్శించాడు. అప్పుడున్న నీరు ఇప్పుడుందా? ఏనాడో సముద్ర గర్భంలో కలసి పోయివుంటుంది. కాని ఆనాటి నుండి ఆ 'నదీ గర్భం' మాత్రం అలాగే వుంది. అప్పటి నీరు వాలుగా ప్రవహించి సాగరంలో కలసిపోయినప్పటికి నాటి నుండి నేటి వరకు గోదావరి నదీ గర్భానికి, దానిలోని నేటికి వుండే పవిత్రత చెక్కు చెదరలేదు. ఏటేటా పాత నీరు పోయి నదిలోనికి కొత్తనీరు వస్తూనే వుంటుంది. అదే విధంగా సత్పురుషులందరికి ఈ సిద్ధాంతం వర్తిస్తుంది. ఓ సాయి పరమాత్మా! మీ పట్ల కూడా ఈ న్యాయమే వర్తిస్తుంది.

గోదావరి తీరంలోని సత్పురుషులు

నూరు సంవత్సరాలు కలిస్తే ఒక శతాబ్దమౌతుంది. అలాగే సత్పురుషులు సాధు జనులకన్నా నూరు రెట్లు అధిక తేజస్వులు. వీరు నది మధ్యలోని మహా ప్రవాహంలాంటివాళ్ళు. ఇతర సాధుజనులందరూ నది లోని చిన్నచిన్న అలలలాంటి వాళ్ళు. ఈ పవిత్ర గోదావరిలో మొట్టమొదట ప్రవాహ రూపంలో వచ్చిన సత్పురుషులు – సనత్కుమారుడు, సనక సనందులు మొదలైనవాళ్ళు. అది నిస్సంశయం. ఆ తర్వాత నారదుడు, తుంబురుడు, ధ్రువుడు, ప్రహ్లాదుడు, బలి చక్రవర్తి, శబరి, అంగదుడు, ఆంజనేయుడు, విదురుడు, గోపగోపికలు మొదలైనవాళ్ళు ప్రభవించారు. ఇలా పూర్వ కాలం నుంచి ఈనాటివరకు గడచిన ప్రతి శతాబ్దంలోనూ వచ్చిన ఎన్నో వరద ప్రవాహాల్లాంటి సత్పురుష పరంపరను వివరించగల శక్తి నాకు లేదు. ఓ సాయినాథా! అదే ఒరవడిలో గోదావరిలో 'ఉప్పెన'లా ఈ శతాబ్దంలో మీరు అవతరించారు. ఇది యదార్థం.

శరణాగతి

ఓ సాయిసమర్థా ! అందుకే సకల పాపాలు నిర్మూలించగల నీ దివ్య చరణారవిందాలను నేనాశ్రయించాను. దేవా ! నా అవగుణాలు పరిగణించి నిరాదరించకు. నన్ను దయతో కాపాడు. ఓ దయాఘనా ! సాయిదేవా ! నేను దీనుణ్ణి హీనుణ్ణి, అజ్ఞానిని, మహాపాపిని, దుష్కర్మాసక్తుణ్ణి, సకల దుర్గుణాలూ వున్నవాణ్ణి. ఐనప్పటికీ నన్ను ఉపేక్షించకు. దీనబంధూ ! గ్రామ గ్రామాలునుంచీ వచ్చి తనలో కలిసే మురికి కాలువలను గోదావరి నది తిరస్కరిస్తుందా! పరశువేది ఇనుములోని దోషాలను పరిగణిస్తుందా ! ఓ అనాథనాథా ! నీవు పరశువేదివి. నేను పాపాత్ముడనని నన్ను విడువకు. నీ దరి చేర్చుకో. నాలో ఎన్నో కల్మషాలున్నాయి. ఓ పతిత పావనా! నీ కరుణాకటాక్ష వీక్షణాలు నాపై ప్రసరించి వాటిని తక్షణమే సమూలంగా నిర్మూలించు. ఇదే ఈ దాసుని విన్నపం. ఓ సాయిగురువరా! పరశువేది తాకిన తర్వాత కూడా ఇనుము బంగారంగా మారకుండా ఇనుముగానే మిగిలిపోతే ఆ లోపం దేనిది? పరశువేదిది కాదా ? అందుచేత నాలో పరివర్తన కలగకపోతే ఆ లోపం ఎవరిది?!? (కనుక మాలోని మాలిన్యాలను పోగొట్టి మమ్ములనుద్ధరించి). బాబా ! దీనబంధూ ! నా భాగ్య ప్రదాత మీరే. నన్ను పాప విముక్తుణ్ణి చెయ్యండి. నన్ను పవిత్రుడిగా చేయలేదన్న అపకీర్తి మీకు రాకూడదు. మీరు పరశువేది – నేను ఇనుప ముక్కలాంటివాణ్ణి. అందుచేత అది మీ బాధ్యత కూడా. సాయిమాతా ! బిడ్డలు తప్పు చేయడం సహజమే. కాని తల్లి కోపగించుకొంటుందా ? వాళ్ళను ప్రేమగా లాలించి చేరదీయదా ! అదే విధంగా నన్ను కరుణించు. నాపై కోపించకు.

ఓ సమర్థ సద్గురూ ! మీరు మా కోరికలు తీర్చే కల్పతరువు. ఈ భవసాగరాన్ని దాటించే 'నావ' మీరే. ఇది నిస్సంశయం. ఓ సాయినాథా! నీవే కామధేనువు. నీవే జ్ఞానాకాశంలో ప్రకాశించే భాస్కరుడవు. నీవే సద్గుణాల నిధి. స్వర్గధామం చేర్చే సోపానం కూడా నీవే. ఓ పరమ పావనా ! పుణ్య పురుషా ! ఓ శాంత స్వరూపా !

ఆనంద నిలయా ! చిత్స్వరూపా ! పూర్ణావతారా ! భేద వర్జితా ! జ్ఞాన సింధూ ! వందనం. ఓ విజ్ఞాన మూర్తి ! పురుషోత్తమా ! క్షమ, శాంతి నిలయమా ! భక్త లోక విశ్రాంతి ధామమా ! మమ్ములను అనుగ్రహించండి. మీ చల్లని కృపావర్షం మాపై కురిపించండి.

విశిష్టావతారుడు శ్రీసాయి

ఓ సాయినాథా ! సమర్థ సద్గురూ ! సద్గురు మచ్ఛీంద్రనాథుడు మీరే. మహాత్ముడైన జాలంధరుడు, నివృత్తినాథుడు, జ్ఞానేశ్వర మహారాజు, భక్త కబీరు, గోండా నివాసి శ్రీ షేక్ మహమ్మద్, ఏకనాథ మహారాజ్ కూడా మీరే. ఓ సమర్థ సద్గురూ ! ధామణ్‌గాం నివాసి మాణ్‌కోజీ బోధలా, సావత మాలి, సమర్థ రామదాస స్వామి, భక్త తుకారామ్, సఖారాం మహారాజ్, మాణిక్య ప్రభువు కూడా మీరే. ఓ సాయినాథా ! మీరు సకల సద్గురు స్వరూపులు.

బాబా ! మీ అవతార లక్ష్యం అనూహ్యం. మీ కుల గోత్రాలు అతి రహస్యం. మీ చరిత్ర అగోచరం. ఓ సాయికృష్ణా ! నిన్ను కొందరు మహమ్మదీయుడంటారు. మరి కొందరు బ్రాహ్మణుడవంటారు. కాని నీ నిజస్థితి ఎవరి కెరుక ? ఆహా ! శ్రీకృష్ణుడిలా పరమాద్భుత లీలలు ప్రదర్శిస్తూనే వున్నావు. ఆనాడు శ్రీకృష్ణుని గురించి కూడ ప్రజలు ఎన్నో విధాలుగా భావించారు. కొందరు 'యదుకుల భూషణుడు' ని కీర్తిస్తే, మరికొందరు 'పశువుల కాపరి' అని హేళన చేశారు. శ్రీ కృష్ణుడు యశోదకు సుకుమార బాలుడు. కంసుడి పాలిట కాలయముడు.

ఉద్ధవునికి ఆప్తమిత్రుడు. అర్జునుడికి పూర్ణజ్ఞాని. ఓ గురురాయా ! అలాగే జనులు మీ గురించి కూడా ఎవరి మనోభావాల్నిబట్టి వారు భావిస్తున్నారు. అందుకు తగినట్లుగానే ఫలం పొందుతున్నారు.

మీరుండేది మశీదులో ! మీ చెవులకు కుట్లు లేవు. నైవేద్యం సమర్పించేటప్పుడు తరచు ఫాతిహా చదువుతూంటారు. ఇవన్నీ చూసి కొందరు మిమ్మల్ని మహమ్మదీయుడన్నారు. ఓ కారుణ్యమూర్తీ ! మీరు నిరంతరాగ్నిహోత్రి నిరంతరం ధుని వెలిగించి వుంచుతారు. మీ అగ్నిహోత్రారాధన చూసి మిమ్మల్ని హిందువుగా భావించడం కూడ సహజమే కదా!

కాని సాయి దేవా ! ఇట్టి జాతి భేదాల భ్రాంతులు శుష్క వివాదాలలో, తర్క వితర్క మాయాజాలంలో మునిగి తేలే తార్కికులకు మాత్రమే. కాని నిజమైన భక్తులు, భావ జిజ్ఞాసులు మాత్రం వీటికి ప్రాముఖ్యత నివ్వరు. వారు ఇలాంటి మాయాజాలంలో చిక్కుకోరు. ఓ సద్గురు సార్వభౌమా ! నిజానికి మీది పరబ్రహ్మస్థితి. ఈ జాతి మతాలకు మీరు అతీతులు. మహోన్నతుడవైన జగద్గురుమూర్తివి. ఈ జగత్కర్తలు మీరే. బాబా ! హిందూ ముస్లీమ్ ల పరస్పర స్పర్ధలను రూపు మాపి, సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించ డానికి మశీదులో నిరంతరం ధుని వెలిగించి, అగ్నిహోత్రారాధన చేస్తూ అపూర్వ లీలా విలాసాల్ని ప్రదర్శించావు. భక్తులకు ఏకత్వాన్ని చాటి చెప్పావు. సాయిశా ! నీవు కుల గోత్రాల కతీతుడవు. సత్స్వరూపివి. నీవు మా ఊహలకందని అవతార మూర్తివి. ఓ సాయి పరమాత్మా! తర్క వితర్కాలనే జోడు గుర్రాలపై స్వారీ చేస్తూ ఊహాతీతుడవైన నిన్ను చేరగలామా ! తార్కికులకు అంతుపట్టని మీ నిజతత్వాన్ని వాక్కులతో ప్రకటించడం సాధ్యమా ! అది శబ్ద పరిధికి మించినది. అటువంటప్పుడు నా మాటలు నిలువగలవా ! (అందుకు సంపూర్ణ భక్తి విశ్వాసాలు మాత్రమే సాధనాలు.)

ప్రశంస

ఓ తేజః స్వరూపా ! మీ సన్నిధిలో భావపరంపర పెల్లుబుకి రాగా, మౌనంగా వుండలేక పలుకుతున్నాను. వ్యవహార సరళిలో స్తుతించడానికి సాహిత్యంలోని పలుకులే కదా సాధనాలు ! అందుచేత నిన్ను కీర్తించే ఈ పదజాలమే పవిత్ర స్తుతి సాహిత్యమై

చిరస్థాయిగా నిలుచుగాక. బాబా ! అందుచేత మీ అనుగ్రహంవల్ల లభించిన కవితాశక్తితో నా శక్తి కొలది మిమ్మల్ని సదా కీర్తిస్తూనే వుంటాను.

సత్పురుషులు ఎంతో ఉన్నతులు. వారు దేవతలకన్నను శ్రేష్ఠులు. ఎందుకంటే వారికి తన, పర అనే భేదభావం వుండదు. వారు ఆశ్రితులయెడ ఎలాంటి తారతమ్యం చూపించకుండా వారిపై కరుణరసం కురిపిస్తారు. హిరణ్య కశిపుడు, రావణాసురుడు మొదలైన వాళ్ళు దేవతల్ని ద్వేషించారు. అందుకే వారిచేత సంహరించబడ్డారు. కాని సత్పురుషుల చేతిలో అలా హాని పొందిన వారొక్కరూ లేరు. గోపీచంద్ మహారాజు జలందర్ మునీశ్వరుణ్ణి పేడకుప్పలో పాతిపెట్టాడు. కాని ఆ మహాత్ముడు అతడి దుష్కార్యానికెంత మాత్రం కలత చెందలేదు. పైగా ఆ మూర్ఖుడైన గోపీచంద్ మహారాజుకు ఆ దోషం అంటకుండ కాపాడి, అతణ్ణి ఉద్ధరించాడు. అంతే కాదు అతనికి అమరత్వాన్ని కూడ ప్రసాదించాడు. ఇట్టి సాధు సత్పురుషుల ఔన్నత్యాన్ని వర్ణించడం ఎవరితరం ? సాధు సత్పురుషులు సూర్య భగవానుడి లాంటివారు. వారి కృప జ్ఞానప్రకాశం. వారు అమిత సుఖ ప్రదాతయైన చంద్రుడులాంటి వారు. వారి కరుణ చల్లని వెన్నెలలా ఆహ్లాదభరితం. సాధు సత్పురుషులు పరిమళ భరితమైన కస్తూరిలాంటివారు. వారి అవ్యాజ కరుణ సుగంధంలా పరిమళిస్తుంది. వారు రసపూర్ణమైన చెరకులాంటివారు. వారి దయ అత్యంత మధురం. వారు దుష్టుల యందు శిష్టులయందు కూడ సమబుద్ధి కలిగివుంటారు. అంతేకాదు, పాపాత్ములపై మరింత దయ కలిగివుండడం వారి సహజగుణం.

పాప ప్రక్షాళన

ఎలాగంటే మలిన వస్త్రాలే శుభ్రం కావడానికి గోదావరి నది వద్దకొస్తాయి. కాని శుభ్రమైన బట్టలకు ఆ అవసరం వుండదు. అవి గోదావరికి దూరంగా పెట్టెలోనే వుంటాయి. ఐతే... ఆ పెట్టెలో ఇప్పుడున్న పరిశుభ్రమైన వస్త్రాలు కూడా పూర్వం మురికివే ! ఒకప్పుడు గోదావరి వద్దకొచ్చి శుభ్రపడి పెట్టెలోనికి చేరినవే !

ఓ సాయిసమర్థా ! పతితపావనా ! ఆ పేటికే 'వైకుంఠము' మీరే పవిత్ర 'గోదావరి'. మీ యందు అచంచల విశ్వాసమే 'స్నాన ఘట్టం'. జీవులే 'వస్త్రాలు'. అరిషడ్వర్గాలే 'మాలిన్యాలు'. అనగా మీయందు విశ్వాసం అనే స్నానఘట్టంలో జీవాత్మలనెడు వస్త్రాలు షడ్వికారాలనే మాలిన్యాలను తొలగించుకొంటాయి. ఓ సాయి సమర్థా ! మీ పాద పంకజ దర్శనమే మాకు పవిత్ర 'గోదావరి స్నానం'. కరుణా కటాక్ష వీక్షణాలు మాపై ప్రసరింపజేసి, మా పాప ప్రక్షాళన గావించి మమ్మల్ని పునీతులను చేయగల సమర్థులు మీరే ! పరమ పావనమూర్తీ ! మేము సామాన్య మానవులం. ఇహ లోక వాసనలకు లోబడి, మేము చేసే పనులవల్ల తరచు పాపాలను (మాలిన్యాలు) పొందుతుంటాం. అందుచేత వాటి ప్రక్షాళన కోసం తరచు మీలాంటి ఉత్తమ సాధు సత్పురుషుల సందర్శనం మాకవసరం. గోదావరినదిలో నీరు పుష్కలంగా వున్నప్పుడు శుభ్రపడడంకోసం మురికి బట్టలొస్తాయి. కాని అవి శుభ్రం కాకుండా మలిన వస్త్రాలుగానే అక్కడి స్నానఘట్టాలపై మిగిలిపోతే ఆ అప్రతిష్ట గోదావరికే కదా !

సమాశ్రయము

ఓ సద్గురు మౌళీ ! మీరు ఏపుగా పెరిగి చల్లని నీడనిచ్చే మహావృక్షం వంటివారు. మేము తీవ్ర తాపత్రయాగ్నితో బాధపడుతూ మీ నీడలో సేదదీరాలని ఆరాటపడే బాటసారులం. ఓ గురు సార్వభౌమా ! కరుణా వరుణాలయా ! సర్వోత్కృష్టమైన మీ సత్కృప యనెడి చల్లని నీడలో మమ్మల్ని సేదదీర్చి ఆ వేడినుండి రక్షించండి. ప్రభూ ! నీడ కోసం ఒక వృక్షం క్రింద కూర్చొన్నప్పుడు ఇంకా పైనుండి ఎండ వేడి తగులుతుంటే, దాన్ని నీడనిచ్చే వృక్షమని ఎవరంటారు ? భక్త మందారా ! మహావృక్షం వంటి మిమ్మల్ని మేమాశ్రయించాం. ఇంకా తాపత్రయాగ్ని మమ్మల్ని బాధిస్తుంటే మిమ్మల్ని ' ఆశ్రిత మందారమ' నీ ఎవరంటారు ? ! ?

ఓ సాయీ ! ఈ లోకంలో జనావళికి మీ కృప లేకుండా మేలు జరగడం అసాధ్యం. కృష్ణభగవానుని అనుగ్రహం వల్లనేగదా కురుక్షేత్రంలో అర్జునుడు ధర్మ మార్గమెరిగి

ధన్యుడయ్యాడు ! స్నేహశీలియైన సుగ్రీవుని సహాయంతో విభీషణుడు శ్రీరామచంద్రుని దివ్య సన్నిధిని పొందగలిగాడు. అతడి ద్వారానే రామ విభీషణుల మైత్రీబంధం పెంపొందింది. ఆ సత్పురుషుల కారణంగానే శ్రీహరి మహిమలు విశ్వవిఖ్యాతమయ్యాయి.

వేదాలు కూడ నిర్గుణ పరబ్రహ్మను సంపూర్ణంగా వర్ణించలేక పోయాయి. అందుచేత అవ్యక్తమైన నిర్గుణ బ్రహ్మత్వాన్ని ఊహించి ఉపాసించడం సామాన్యులకు సాధ్యం కాదు. అందుకే ఋషులు 'సగుణోపాసన' అనే సాధనాన్ని భూలోకంలో ప్రవేశపెట్టి ప్రచారం చేశారు. ఆ పరబ్రహ్మను సగుణ సాకార రూపంలో భూమిపై అవతరింపజేశారు. వైకుంఠాధిపతి, రుక్మిణీ వల్లభుడు అయిన శ్రీకృష్ణుణ్ణి దామాజీ మాలవానిగా (అంటరానివాడుగా) చేశాడు. ఆ జగన్నాథుడే భక్త చోఖామేళా కోసం పశువుల కళేబరాలు మోశాడు. సాధు సత్పురుషుల అసమాన శక్తి సామర్థ్యాలకు లోబడి ఆ జగన్నాథుడైన శ్రీహరి నీటి కడవలు మోసి వారికి సేవలందించాడు (సక్కుబాయి భక్తికి మెచ్చి శ్రీకృష్ణుడు, ఏకనాథ్ మహరాజ్ యొక్క గురుభక్తికి మెచ్చి ఆ శ్రీహరి సేవకులవలె నీటి కడవలు మోసారు). అట్టి సత్పురుషులు (సద్భక్తులు) అసమాన శక్తి సంపన్నులు. వారు సచ్చిదానంద స్వరూపుడైన పరమాత్మను కూడా శాసించ గలవారే ! ఇలా సత్పురుషుల మహిమల గురించి ఇంకా ఎంతని వర్ణించను?

యోగీశ్వరేశ్వరుడు

ఓ సాయినాథా! సద్గురుమౌళీ! శిరిడీపురాధీశా! యోగీశ్వరేశ్వరా! ఇన్ని మాట లెందుకు ? మీరే నా తల్లి, తండ్రి. నా సర్వస్వం మీరే. ఓ సాయీశా! అగణిత లీలా విలాసా ! నిజానికి మీ లీలల పరమార్థాన్ని గ్రహించగల వారెవ్వరు? పామరుడినైన నేను మాటలకందని మీ లీలలనేవిధంగా వర్ణించగలను ? బాబా! జీవుల నుద్ధరించడానికే మీరు శిరిడీలో అవతరించారు. ప్రమిదల్లో నూనెకు బదులుగా నీరు పోసి దీపాలు

వెలిగించి, తామస జనుల అజ్ఞానాంధకారాన్ని పారద్రోలారు. ఓ సాయీ! శేషశాయీ! జానెడు వెడల్పున్న చెక్కబల్లను ఎత్తులో వ్రేలాడదీసి దానిపై నిద్రించారు. నిరుపమానమైన మీ యోగశక్తిని ఎఱుక పరచి, భక్త జనులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేశారు.

ఆశ్రిత వత్సలుడు

మీ ఆశీర్వచన ప్రభావంతో ఎందరో గొడ్రాళ్ళు సంతానవతు లయ్యారు. మీరు ఎందరో రోగుల వ్యాధులను ఊదీతో నిర్మూలించారు. ప్రభూ! మా ఐహిక బాధలను తొలగించడం మీకసాధ్యం కాదు. గజరాజుకు చిన్న చీమ బరువనిపి స్తుందా? ఓ సద్గురు రాయా! ఈ దీనుని కరుణించు. దీన బంధూ! నీవే దిక్కని నమ్మి వినమ్రంగా నీ పాదాల నాశ్రయించిన నన్ను నిరాదరించకు. ప్రభూ! నీవు రాజాధి రాజువి. ధనికులలో కుబేరుడివి. వైద్యులలో ధన్వంతరివి. ఈ జగతిలో నీకు నీవే సాటి.

శ్రీ సాయినాథ పూజ

సాయిదేవా! ఇతర దేవతల పూజకు ఎన్నో పూజాద్రవ్యాలున్నాయి. ఎన్నెన్నో పూజా విధానాలున్నాయి. కాని ఈ లోకంలో నిన్ను పూజించ డానికి తగిన వస్తువే లేదు ! ప్రతి వస్తువులోనూ నీ అంశ కన్పిస్తూవుంటే నిన్ను దేనితో పూజించగలను! ఎలా పూజించగలను? సూర్య భగవానుడు తన రాజ్యంలో దీపావళి పండుగ ఎలా జరుపుకుంటాడు? ఏ కాంతి ద్రవ్యాలతో జరుపు కుంటాడు? సాగరుడికి దాహం వేస్తే, ఆయన దప్పిక తీర్చగల నీరు ఈ భువిపై లభిస్తుందా? అగ్నిహోత్రుడికి చలివేసి వేడి కావాలంటే నిప్పు ఎక్కణ్ణించి తేగలం? ఓ సాయి! సమర్థసద్గురూ! పూజా సామాగ్రి అంతా నీ అంశతోనే నిండి వుంది. మొదటినుంచీ అవి నీలోని భాగమే. ఈ నిజం నీకు తెలియనిదా!

సాయీ నేను తత్వదృష్టిలో ఏవేవో వేదాంత విషయాలు ఊరికే చెబుతున్నాను. కాని నిజానికి నా మనసుకు అంతటి దివ్యానుభూతి కలగలేదు. అందుచేత అనుభవజ్ఞానం లేకుండా నేను పలికే ఈ నిస్సారమైన మాటలన్నీ నిరర్థకం. ఓ గురు సార్వభౌమా! మీతో సాన్నిహిత్యాన్ని పెంచుకోవాలని మిమ్మల్ని వ్యావహారిక రీతిలో అర్చిస్తున్నాను. నిజానికి ఆ సామర్థ్యం కూడా నాకు లేదని నేనెరుగుదును. అందువల్ల అనేక రూప కల్పనలతో మిమ్మల్ని పూజిస్తున్నాను. ఓ కృపానిధీ! దయతో ఈ దాసుని పూజలు స్వీకరించి, ఆత్మార్పణ శక్తిని ప్రసాదించండి.

ఓ పరాత్పరా! ప్రేమాశ్రువులతో మీ పాదాలు కడుగుతున్నాను. మీకు 'సద్భక్తి' అనే చందనం పూయుచున్నాను. బాబా! 'శబ్దాలంకారాలు' అనే కఫనీని మీకు వస్త్రంగా సమర్పిస్తున్నాను. 'ప్రేమ భావాల'నే కుసుమాలతో కూర్చిన పూలమాలతో మీ గళసీమ నలంకరిస్తున్నాను. ఓ పాపభంజనా! నా దుర్గుణాలను, పాప కర్మలను కాల్చి ధూపం వేసి మిమ్మల్ని అర్చిస్తున్నాను. నిజానికి అవి మలిన పదార్థాలే కాని వాటినుండి దుర్గంధం వెలువడటం లేదు! సద్గురు సన్నిధిలో కాక ధూప సామాగ్రిని మరెక్కడ వ్రేల్చినప్పటికీ, ఆయా ద్రవ్యాల సహజ వాసనలే వెలువడతాయి. ధూపద్రవ్యం అగ్నిని స్పృశించగానే దాని సహజ పరిమళం వెదజల్లబడుతుంది. ఇది సహజం. ఓ పతిత పావనా! కానీ మీ సమక్షం ఇందుకు విరుద్ధం. సహజ వాసనలు అగ్నిలో ఆహుతైపోతాయి. పరిసర ప్రాంతమంతా సుగంధ పరిమళం అక్షయంగా వ్యాపించి, శాశ్వతంగా నెలకొంటుంది. (సాయి సన్నిధిలో మన కల్మషాలు దహించబడి సద్గుణాలు పరిమళిస్తాయి. అంటే పతితులు పావను లౌతారు). గంగాజలంలోని మలినాలను తొలగించగానే, గంగానది నిర్మలమై తిరిగి పూర్వపు పవిత్రత సంతరించుకుంటుంది. అలాగే మనసులోని మాలిన్యాలు తొలగగానే 'ఆత్మ' పరిశుద్ధమై ప్రకాశిస్తుంది.

ఓ గురుచంద్రమా! 'మాయ, మోహం' అనే ధూపదీపాలను మీ ముందు వెలిగిస్తున్నాను. ప్రతిఫలంగా నాకు పూర్ణ వైరాగ్య స్థితిని ప్రసాదించండి. 'అచంచల విశ్వాసమ'నే సింహాసనాన్ని నిండు మనస్సుతో మీకు ఆసనంగా సమర్పిస్తున్నాను. దయతో దానిపై విరాజమానులై నా 'భక్తి'నే నైవేద్యంగా స్వీకరించండి. ఓ సాయీ పరాత్పరా! దానిని ఆరగించి అందలి సారాన్ని (మీరు స్వీకరించాలనే దివ్యానుభూతిని) తిరిగి నాకు ప్రసాదించండి. నేను మీ పసి బిడ్డను. మాతృ స్తన్యాన్ని గ్రోలడం మీ బిడ్డగా అది నా హక్కు (ఇది మానసిక పూజ. ఇందు భక్తుడర్పించేది భక్తి నైవేద్యం. భక్తుడు భగవంతుడి నుండి ఆశించే ప్రతిఫలం సంపూర్ణ మానసిక సంతృప్తి). నా మనసే మీకు దక్షిణగా సమర్పించాను. దయతో స్వీకరించండి. అందుచేత ఇక మీదట నేను చేయబోయే పనులన్నింటికి 'నేను కర్తను' అనే అహంభావాన్ని నాలో తొలగించి సంపూర్ణ వైరాగ్యస్థితిని ప్రసాదించండి. పుణ్యశ్లోకా! సాయి సత్ప్రభూ! వినమ్రుడనై అనన్య భక్తితో కూడిన ప్రార్థనతో సాష్టాంగ ప్రణామం చేస్తున్నాను. స్వీకరించండి.

ప్రార్థనాష్టకము

సాయినాథా! శాంతచిత్తా! అసమాన ప్రజ్ఞాధురీణా! దయాఘనా! కరుణాసింధూ! సత్యరూపా! మాయా మోహాంధకార వినాశకా! కుల గోత్రాల కతీతుడవైన ఓ సిద్ధ పురుషా! ఊహాతీతా! కరుణా వరుణాలయా! శిరిడీ పురవాసా! ఓ సాయినాథ ప్రభూ! పాహి మాం, పాహి మాం. జ్ఞాన భాస్కరా! జ్ఞాన ప్రదాతా! సకల శుభంకరా! సద్భక్త హృదయ విహారా! శరణాగత రక్షకా! పాహి మాం.

నీవు సృష్టికర్తవైన బ్రహ్మదేవుడవు; స్థితి కారకుడైన లక్ష్మీ వల్లభుడవు; ముల్లోకాలకు లయ కారకుడైన రుద్రుడవు కూడ నిశ్చయంగా నీవే. ఓ త్రిమూర్తి స్వరూపా! సాయినాథా! నీకు నమస్సులు. నీవు సర్వవ్యాపకుడవు. ఈ సమస్త భూమండలంలో నీవు లేని చోటంటూ వుందా? నీవు సర్వజ్ఞుడవు. సకల జీవ హృదయాంతరవాసివైన ఓ సాయినాథా! నీకు నమస్సులు.

ఓ సాయిసమర్థా! నా అపరాధాలన్నిటినీ మన్నించు. చంచల మనస్కుడను, భక్తి హీనుడను అయిన నా సందేహాలన్నింటినీ శీఘ్రమే నివారించు. ఓ సాయి గురువరేణ్యా ! నీవు ధేనువు. నేను నీ లేగను. నీవు చంద్రుడవు. నేను చంద్రకాంత మణిని. దివిజ గంగా తరంగిణీ తీర్థమైన నీ పవిత్ర చరణ కమలాలకు ఈ దాసుని హృదయ పూర్వక వందనాలు. సాయి సత్ప్రభూ! కరుణతో మీ వరద హస్తాన్ని నా శిరసుపై నుంచి నన్ను దీవించండి. మీ దాసుడివైన ఈ దాసగణుని చింతలు, శోకాలు సత్వరమే నివారించండి.

శరణాగతి ప్రార్థన

ఓ సాయినాథా ! ఈ ప్రార్థనాష్టకాన్ని మీకు సమర్పించి మీ ముందు సాష్టాంగ పడుతున్నాను. నా పాప, తాప, దైన్యాలను సమూలంగా హరించి నన్నుద్ధరించండి. ఓ సాయి గురువరా ! మీరు గోమాత. నేను మీ లేగ దూడను. మీరు నా ప్రియ జనని. నేను మీ అనుంగు పసిబిడ్డను. కనుక నాపై కాఠిన్యం చూపకండి.

ఓ పతిత పావనా! నీవు మలయగిరియందలి శ్రీ చందన వృక్షంలాంటి వాడివి. నేనో... ముళ్ళ పొదలాంటివాణ్ణి. నీవు జీవనదియైన పవిత్ర గోదావరి జలం లాంటివాడివి. నేనో... మహా పాతకుణ్ణి. ఓ గురురాయా! నిన్ను దర్శించగానే నా మనో మాలిన్యాలు, దుర్బుద్ధులు నశించకపోతే నిన్ను చందన వృక్షంలాంటి వాడవని ఎవరంటారు!?!

కస్తూరితో కూడిన మన్ను కూడ సుగంధ పరిమళభరితమై దాని విలువ పెరుగు తుంది. పుష్పమాలలోని దారం పుష్పాల సాంగత్యం వల్లనేగదా శిరస్సు పైకెక్కి ఉన్నత స్థానం పొందుతుంది! మహాత్ములు గ్రహించడంచేత వారి మహిమవల్ల సామాన్య వస్తువులుగూడ విశిష్ట స్థితిని పొందుతాయి. అదే మహాత్ముల సాంగత్య ఫలం. నిజానికి భస్మం, కౌపీనం, నంది (ఎద్దు) సామాన్య వస్తువులే ! కాని మహేశ్వరుడు గ్రహించడంచేత వాటికి జగద్విఖ్యాతి కలిగింది. శ్రీకృష్ణపరమాత్మ యమునా తీరాన

బృందావనంలో ఉట్లు కొట్టి, రాసక్రీడ సలిపాడు. అందుకే గోపకులకు, బృందావనానికి, యమునా తీరానికి ఎంతో ప్రాశస్త్యం, బుధజనుల గుర్తింపు లభించాయి.

ఓ గురుదేవా ! సాయినాథప్రభూ ! నేను దురాచారుణ్ణే ! కానీ మీ శరణుజొచ్చాను. నా దురాచారాలను నిర్మూలించమని, నాకు సదా మీ పద సన్నిధిని ప్రసాదించమని మిమ్మల్ని పదే పదే వేడుకొంటున్నాను. ఓ సద్గురుమౌళీ ! సాయి సమర్థా! సుఖాల నాశించి మేము కోరే ఇహలోక పరలోక సంబంధమైన కోరిక లేవైనా మీరు తప్పక నెరవేరుస్తారని నాకు నిశ్చయంగా తెలుసును. కాని గురుదేవా! నాకు సంపూర్ణ వైరాగ్య బుద్ధి (ఏ సుఖాలు ఆశించని స్థితి) నివ్వండి. చంచలత లేని నిశ్చల మనసునివ్వండి. బాబా! నా మనస్సు సదా నా ఆధీనంలో వుండేటట్లు అను గ్రహించు. సముద్రంలోని నీరు తియ్యగా మారితే, ఇంక ఉప్పునీరు త్రాగవలసిన అవసరం వుండదు కదా! సాయి సమర్థా! సముద్ర జలాలను సహితం మధురంగా మార్చగల అపార శక్తిమంతులు మీరు. అందువల్ల మీ దాసుడైన ఈ దాస్గణుని ఈ చిరు కోరికను మన్నించండి. ఓ పరంతపా! పతిత పావనా! నా దోషాలన్నీ స్వీకరించమని మిమ్మల్ని అర్థిస్తున్నాను. సిద్ధ పురుషులలో అగ్రగణ్యులైన మిమ్మల్ని నాదోషాలెంతమాత్రం అంటవు. బాబా! ఇన్ని మాటలెందుకు? మీరే నా ఆశ్రయం. తల్లి ఒడిలోవున్న బిడ్డ ఎంతో నిర్భయంగా, ఎంతో సురక్షిత భావంతో వుండడం సహజమే కదా! నేను కూడా మీ అండ జేరి అలాంటి దివ్యా నుభూతినే అనుభవిస్తున్నాను.

ఫలశృతి

ఓ సాయీసత్ప్రభూ ! ఎవరైతే భక్తి ప్రేమలతో ఈ స్తోత్రాన్ని పఠిస్తారో వారి కోరికలు నెరవేరేలా అనుగ్రహించండి. ఈ స్తవన మంజరీ నిత్యం పఠించేవారిపై మీ అనుగ్రహం సదా ప్రసరించి ఒక సంవత్సరంలోనే వారి త్రితాపాలు (దైహిక, ఐహిక, మానసిక తాపాలు, కష్టాలు) కడతేరుగాక ! శుచిర్భూతులై, నిర్మలాంతః కరణతో, నిశ్చలమైన

భక్తి విశ్వాసాలతో ఎల్లరు ప్రతి నిత్యము ఈ స్తవన మంజరీని పఠించెదరుగాక! నిత్య పారాయణ కవకాశం లేకపోతే, ప్రతి గురువారం రోజున శ్రీ సాయి సద్గురుని దివ్య మంగళ రూపాన్ని మీ మనస్సులో ప్రతిష్టించి దీనిని పఠించండి. అందుకు కూడ అశక్తులైతే కనీసం ప్రతి ఏకాదశినాడు భక్తితో పఠించినప్పటికి అద్భుతమైన ఫలం పొందగలరు. పాఠకులారా! మహామహిమాన్వితమైన ఈ స్తవనమంజరీని పఠించేవారిపై సాయి భగవానుని కృప వర్షిస్తుంది. సాయిపరమాత్మ సత్వరమే వారి ఐహిక, పారమార్థిక కోరికలన్నీ నెరవేర్చి అంత్యకాలంలో ఉత్తమ గతులు ప్రసాదిస్తారు. దీనిని తరచు పఠించినచో మందబుద్ధుల బుద్ధి వికశిస్తుంది. అల్పాయుష్కులు శతాయుష్కులౌతారు. ఈ స్తవనమంజరి నిత్య పారాయణ వలన నిరుపేదల ఇంట కుబేరుడే నివసిస్తాడు. ఇది సత్యం, సత్యం సత్యం. ముమ్మాటికి సత్యం. ఈ స్తోత్ర పారాయణవల్ల సంతానం లేనివారికి సంతానం కలుగుతుంది. రోగులు పూర్ణారోగ్య వంతులౌతారు. దీని నిత్య పారాయణ ఫలం అమోఘం. సకల చింతలు, భయాలు తొలగిపోతాయి. కీర్తిమంతులై గౌరవ సత్కారాలు పొందుతారు. చివరకు అవినాశ పరబ్రహ్మను తెలుసుకొంటారు.

సోదర సాయిభక్తులారా! తర్కవితర్కాలకు, వ్యర్థమైన కల్పనలకు, సంశయాలకు తావివ్వకండి, ఈ మహిమాన్విత స్తోత్ర పఠనంవలన ఒనగూడే సత్ఫలితాలపై పరిపూర్ణ విశ్వాసం కలిగి వుండండి. క్రమం తప్పకుండా తరచుగా పరమ పావనమైన శిరిడీ క్షేత్రాన్ని దర్శించండి. అనాథ నాథుడు, భక్త జనుల పాలిట కల్పవృక్షము అయిన సాయినాథుని దివ్య చరణక మలాలను మీ హృదయంలో స్థిరంగా ప్రతిష్టించండి.

స్తోత్రరచన

సాయి సద్గురుని ప్రేరణ వలననే నేనీ స్తవన మంజరిని రచించగలిగాను. లేనిచో పామరుణ్ణైన నాచే ఈ స్తోత్ర రచన సంభవమా! శక సం. 1840 భాద్రపద శుద్ధ చతుర్థి (వినాయక చవితి), సోమవారం మధ్యాహ్నం అనగా ది. 9-9-1918న పావన నర్మదానదీ తీరాన అహల్యా దేవి సమాధి వద్ద ప్రఖ్యాత మహేశ్వర క్షేత్రం (ఇండోర్ దగ్గర్లోనున్న ఒక పుణ్యక్షేత్రం)లో ఈ శ్రీ సాయినాథ స్తవన మంజరీ రచన సంపూర్ణమైంది. శ్రీ సాయిసద్గురుడు నా హృదయంలో ప్రవేశించి యిందలి ప్రతి పదాన్ని స్ఫురింపజేసి ఈ స్తోత్ర రచన పూర్తి చేయించారు. నా శిష్యుడు భక్త దామోదర్ సాయీశుని అనుగ్రహంతో గ్రంథస్థం చేశాడు. ఈ దాసగణు సాధు సత్పురుషులందరికీ సదా దాసుడు.

ఎల్లరకు సకల శుభములు ఒనగూడు గాక ! ఈ శ్రీ సాయినాథ స్తవన మంజరీ భవ సాగరాన్ని తరింపజేసే దివ్య సాధనమై వెలుగొందాలని ఈ దాసగణు ఆ పాండురంగణ్ణి అత్యంతాదరంతో ప్రార్థిస్తున్నాడు. శ్రీ పాండురంగా ! స్వస్తి !

శ్రీహరి హరార్పణమస్తు ! శుభంభవతు ! పుండలీకవరద హరివిఠ్ఠల ॥

సీతాకాంతస్మరణ జయ జయ రామ! పార్వతీపతే హర హర మహాదేవ ॥

శ్రీ సద్గురు సాయినాథ మహరాజ్ కీ జై ॥

శ్రీ సద్గురు సాయినాథార్పణమస్తు । శుభం భవతు ॥

సాయి బంధువులారా !

ఈ 'శ్రీ సాయినాథ స్తవన మంజరీ' మహారాష్ట్రలో బహుళ ప్రచారమై నిత్యపారాయణ చేయబడే అపురూప గ్రంథం. షిరిడీలోని శ్రీసాయిబాబా సంస్థాన్‌వారు మరాఠీ ఇంగ్లీషు, హిందీ భాషల్లో లక్షలాది ప్రతులు ముద్రించి భక్తులకు ఈ గ్రంథం తెలుగు భాషలో అంతగా అందుబాటులోకి వచ్చి ప్రాచుర్యం పొందలేదు. కావున ఈ గ్రంథమును ప్రాచుర్యంలోనికి తీసుకురావాలని సదుద్దేశ్యంతో ....

ఈ శ్రీసాయినాథ స్తవన మంజరీ గ్రంథం సాయిసేవకులు శ్రీ ప్రభాకరరావుగారు వచన కావ్యంగా ప్రచురించి వెలువరించింది మొదలు అనూహ్యమైన స్పందన, ఆదరణ లభించి అనతి కాలంలోనే ఎన్నో వేల ప్రతులు భక్తుల కరకమలాల నలంకరించాయి. దీని పారాయణ వలన ఏనాటినుంచో పరిష్కారం కాని కుటుంబ సమస్యలు పరిష్కారమయ్యాయని, ఉద్యోగం వచ్చిందని, ప్రమోషను వచ్చిందని, ఎంతో మానసిక శాంతి కలుగుతున్నదని అనేక మంది తెలియజేశారు.

మనతోటివారు సాయిభక్తులై తరించడానికి దోహదం చేయడం సాయిభక్తులుగా మన కర్తవ్యం; సాయిసేవ, అది బాబా అనుగ్రహం పొందడానికి సులభమైన మార్గం కూడా ! అందుకే అక్షరుడైన సాయిని అక్షరమాలతో స్తుతించిన, దాసగణు విరచితమైన ఈ మహా మహి మాన్విత స్తోత్రగ్రంథాన్ని సాయి సేవలో భాగంగా శుభకార్యాల్లోను; పుట్టిన రోజు, పెళ్ళిరోజులులాంటి ప్రత్యేక సందర్భాల్లోను; పర్వదినాల్లోనూ; సత్సంగాల్లోనూ బహూకరించండి.